క్లుప్తంగా

నర్సరీ సందర్శన



చారకొండ: మండలంలోని తిమ్మాయిపల్లిలో నర్సరీ, క్రీడాప్రాంగణం, పల్లె ప్రకృతి వనాన్ని బుధవారం ఎంపీడీఓ జయసుధ సందర్శించారు. ప్రకృతి వనంలో మొక్కలు ఏపుగా పెరగడంతో నిర్వాహకులను అభినందించారు. అనంతరం పంచాయతీలో రికార్డులను పరిశీలించారు. కార్యదర్శి కృష్ణ, సర్పంచ్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ ఉద్యోగుల ధర్నా



కల్వకుర్తిరూరల్: డిమాండ్ల సాధన కోసం ఎల్‌ఐసీ ఉద్యోగులు బుధవారం భోజన విరామ సమయంలో ఎల్‌ఐసీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం కార్యదర్శి లక్ష్మణాచారి మాట్లాడుతూ సెప్టెంబర్ 12వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు రెండు గంటల సమ్మె నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఫ్యామిలీ పింఛన్ 15 నుంచి 30 శాతం పెంచాలన్నారు. ఉద్యోగుల ప్రమోషన్లు, బదిలీలు, అలవెన్సుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అశోక్, ఉద్యోగులు పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ

చారకొండ: పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుంటున్నామని పశువైద్య లైవ్ స్టాక్ అధికారి షేక్ మదర్ అన్నారు. బుధవారం మండలంలోని తుర్కలపల్లి, నూకలచింతవాడిక తండాల్లో పశువుకు నోటి, ముక్కు సంబంధిత ఇన్‌ఫెక్షన్ వంటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పశు యజమానులకు వివరించారు. పశువులకు ఏదైన వ్యాధి సోకితే పశువైద్యశాలకు తీసుకురావాలన్నారు. ఆయన వెంట గోపాల మిత్ర శివరాం తదితరులు ఉన్నారు.

గొర్రెల దాణా పంపిణీ



తాడూరు: మండల కేంద్రంలోని యాదవ కమ్యూనిటీ భవనంలో పశువైద్య శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం సబ్సిడీపై అందజేసిన గొర్రెల దాణాను ఎంపీపీ శ్రీదేవి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొత్తం 24 మంది గొర్రెల పెంపకం దారులకు దాణాను అందజేశామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ యాదమ్మ, పశువైద్యాధికారి డాక్టర్ రాజేశ్‌కుమార్, గొర్రెల పెంపకదారుల సంఘం మండల అధ్యక్షుడు సత్యం, మండల కోఆప్షన్ ఎంపీటీసీ అబ్దుల్లా, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

కల్వకుర్తి రూరల్: మండలంలోని తోటపల్లిలో ఘనంగా బోనాల పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారి ఆలయం వరకు బోనాలతో ఊరేగింపుగా వెళ్లారు. అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పోతురాజుల విన్యాసాలు అలరించారు. అంతకుముందు గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజేష్‌రెడ్డి, ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, మట్ట శ్రీనివాస్‌గౌడ్, చిన్నా నారాయణ గౌడ్, లింగారెడ్డి, బలగం చంద్రయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో లుకలుకలు

కందనూలు: ఎన్నికలు సమీపిస్తుండటంతో కాంగ్రెస్ పార్టీలో లుకలుకలు మొదలయ్యాయి. బుధవారం జిల్లా కేంద్రంలోని వెలమ ఫంక్షన్ హాలులో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ , మాజీ మంత్రి కాంగ్రెస్ నేత నాగం జనార్దన్ రెడ్డి ఎదుట తెలకపల్లి మండలానికి చెందిన ఓ ఎంపీటీసీ పార్టీలో తనకు సరైన ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కార్యకలాపాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వసతుల కల్పనకు కృషి



తర్నికల్‌లో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

కల్వకుర్తిరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని తర్నికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో రూ.68 లక్షల వ్యయంతో నిర్మించనున్న అదనపు తరగతి గదులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మనోహరా, మార్కెట్ చైర్మన్ విజయ్‌గౌడ్, వైస్ ఎంపీపీ గోవర్ధన్, ఎంఈఓ బాసూనాయక్, సురేష్‌గౌడ్, దేవయ్య, శ్రీనివాసులు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్టీకి ద్రోహం చేస్తే సహించం

పార్టీకి ద్రోహం చేస్తే సహించమని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని సర్వేల ఆధారంగా సీఎం కేసీఆర్‌ టికెట్లు కేటాయిస్తున్నారన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన తనకు కల్వకుర్తిలో అభ్యర్థిగా ముఖ్యమంత్రి ప్రకటించారని వివరించారు. సమస్యలుంటే చర్చించుకొని పరిష్కరించుకుందామని బహిరంగంగా విమర్శలు చేసే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం , మార్కెట్ చైర్మన్ విజయ్ గౌడ్, వైస్ ఎంపీపీ గోవర్ధన్, వైస్ చైర్మన్ షాహెద్, కౌన్సిలర్లు శ్రీనివాస్ యాదవ్, సూర్యప్రకాశ్ యాదవ్ ఉన్నారు.

కార్యదర్శులకు నియామకపత్రాలు అందజేత

కల్వకుర్తి: ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేస్తూ తీసుకున్న నిర్ణయం మేరకు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో బుధవారం ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు నియామకపత్రాలను అందజేశారు. కల్వకుర్తి మండలంలోని 10 మంది, వెల్దండ మండలం 19 మంది, చారగొండ మండలానికి చెందిన ముగ్గురికి నియామక పత్రాలు అందించారు. కల్వకుర్తి ఎంపీపీ మనోహరా ఎమ్మెల్యేకు రాఖీ కట్టారు. డివిజనల్ పంచాయతీ అధికారి పండరీనాథ్, ఎంపీడీఓ ఆంజనేయులు, ఎంపీఓ దేవేందర్, మాజీ జెడ్పీటీసీ హరిదాసు పాల్గొన్నారు.

సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చా



పాదయాత్రలో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

తెలకపల్లి: సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. పదేళ్ల ప్రజాప్రస్థానంలో మర్రన్న పాదయాత్రలో భాగంగా బుధవారం మండల పరిధిలోని బండపల్లి నుంచి గట్టురాయిపాకుల, గట్టునెల్లికుదురు, గౌరెడ్డిపల్లి, కమ్మరెడ్డిపల్లి, తెలకపల్లి గ్రామాల మీదుగా ఎమ్మెల్యే పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతికనన్ని రోజులు ప్రజలకు సేవ చేస్తానన్నారు. కేఎల్ఐ కాలువ ద్వార సాగునీరు అందించానని పేర్కొన్నారు. ఎంజేఆర్ ట్రస్టు ద్వార సామూహిక వివాహాలు, నిరుద్యోగులకు శిక్షణ, యువతకు ఉచిత డ్రైవింగ్ లైసెన్స్, ప్రజల కోసం రూ.5 కే భోజనం అందిస్తున్నామని వివరించారు. 60 ఏండ్లల్లో జరగని అభివృద్ధి తొమ్మిదేళ్లలో జరిగిందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఓటు వేయొద్దని సూచించారు. ఆయన వెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బైకాని శ్రీనివాస్ యాదవ్, జక్క రఘునందన్‌రెడ్డి, హనుమంతురావు, ఈదుల నరేందర్‌రెడ్డి, కోట్ల శ్రీనివాసులు, రమేష్, లక్ష్మమ్మ, విజయలక్ష్మి, స్రవంతి, సుగుణ, పలుగ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

హాస్టల్‌ను సందర్శించిన ఎంపీ రాములు



కల్వకుర్తి: వసతి గృహాల్లో కనీస వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎంపీ రాములు అన్నారు. బుధవారం మండలంలోని రఘుపతిపేటలో ఎస్సీ బాలుర హాస్టల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి కృసి చేస్తానని ఆయన భరోసా ఇచ్చారు. ఆయన వెంట అధికారులు, సిబ్బంది ఉన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



తాడూరు: తెలంగాణ సాంస్కృతిక సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో మండలంలోని సిర్సవాడలో బుధవారం అంబేడ్కర్ విగ్రహం ఎదుట ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కళాకారుడు జల్లి కృష్ణ మాట్లాడుతూ కళాకారులను ముఖ్యమంత్రి గుర్తించి గౌరవ వేతనం అందిస్తామని హామీ ఇవ్వడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో కళాకారులు భాస్కర్, శివనాగులు, నరేందర్, పార్వతమ్మ, అస్మ, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం: గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొని ఒకరికి తీవ్రగాయాలైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం తెల్కపల్లి మండలం కార్వంగ గ్రామానికి చెందిన రాజు లింగసానిపల్లిలో జరిగే వివాహానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా జిల్లాకేంద్రంలోని హౌజింగ్‌బోర్డుకాలనీలో గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న రాజుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి బాధితుడిని చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు.

ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ ఏర్పాటు

అమ్రాబాద్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో బుధవారం ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ ఏర్పాటు చేశారు. విద్యార్థులు, అధ్యాపకులతో క్లబ్ ఏర్పాటు చేసి ఓటరు నమోదు, ఓటు వేసే విధానంపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని ప్రిన్సిపాల్ మదన్‌మోహన్ సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ క్యాంప్ పీఓ రాధ, తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల నిరసన



తాడూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట బుధవారం ఆశావర్కర్లు నిరసన వ్యక్తం చేశారు. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల ఆశావర్కర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశన్న మాట్లాడుతూ కనీసం వేతనం రూ.18వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు అరుణ, జ్యోతి, షాహెదాబేగం, మణెమ్మ పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రం భవనానికి భూమి పూజ



కొల్లాపూర్ రూరల్: మండలంలోని కుడికిల్లలో బుధవారం ఆరోగ్య ఉప కేంద్రం భవనం నిర్మాణానికి జూపల్లి రామేశ్వరరావు కుమారుడు జూపల్లి వినోద్ రావు బుధవారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడానికి స్వంత నిధులతో భవనం ఏర్పాటు చేస్తున్నామన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు జూపల్లి భాగ్యమ్మ పాల్గొన్నారు

రేపు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ముట్టడి

కల్వకుర్తిరూరల్: పెండింగ్‌లో ఉన్న రూ.5300 కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్లు, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని కోరుతూ సెప్టెంబర్ 1వ తేదీ శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఏబీవీపీ నాయకుడు ప్రశాంత్ యాదవ్ తెలిపారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ కళాశాల, పాఠశాల ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. విద్యార్థి, నిరుద్యోగులకు ప్రభుత్వం అన్యాయం చేస్తోందని ఆరోపించారు. ఏబీవీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యదర్శుల నియామక పత్రాల అందజేత

వెల్దండ: మండలంలోని ఆయా గ్రామ పంచాయతీలల్లో విధులు నిర్వహిస్తున్న జూనియర్ కార్యదర్శులను రెగ్యులర్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఎంపీడీఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలో మొత్తం 19 మంది జూనియర్ కార్యదర్శులు బుధవారం ప్రభుత్వం నుంచి వచ్చిన నియమాక పత్రాలను అందజేరు. కార్యక్రమంలో ఎంపీటీసీ గుత్తి వెంకటయ్యయాదవ్, కార్యదర్శులు ఫయాజ్, శ్రీనివాసులు, నందకిషోర్, మంజుల, స్వప్న, తదితరులు ఉన్నారు.

ఘనంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ

చారకొండ: మండల కేంద్రంలో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయాన్ని పునఃనిర్మాణం చేపట్టిన సందర్భంగా వేదపండితుల మంత్రోచ్చరణ, మంగళవాయిద్యాల మధ్య హోమం, బలిహారణ, శిఖర స్థాపన ప్రత్యేక పూజలు చేసి దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. అచ్చంపేట్ మాజీ ఎమ్మెల్యే వంశీకృష్ణ హాజరయ్యారు. నాయకులు, నిర్వాహకులు అఖిలేష్, కొండల్, అనిల్, శ్రీను, శ్రీరాములు, శివ, యాదగిరి తదితరులు ఉన్నారు.

బీఎస్పీ నాయకుల అరెస్టు



తెలకపల్లి: ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి పాదయాత్రను అడ్డుకుంటారని సమాచారం మేరకు బుధవారం ముందస్తుగా బీఎస్పీ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. రెడ్డపాకుల శివశంకర్, భీంపాగ మల్లేష్, రాజేష్, భాస్కర్‌లను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీస్ స్టేషన్‌లో నిరసన వ్యక్తం చేశారు. మండల అభివృద్ధికి ఏం చేశారని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిని ప్రశ్నించారు.

ఉద్యోగులకు అండగా ప్రభుత్వం



అచ్చంపేటలో ఆర్డర్ కాపీలు అందుకుంటున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

అచ్చంపేట రూరల్: ఉద్యోగులకు ప్రభుత్వం అండగా ఉందని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ కుమార్ దీపక్, డీపీఓ కృష్ణతో కలిసి జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు రెగ్యులరైజేషన్ ఆర్డర్ కాపీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వ విప్ బాలరాజు మాట్లాడారు. అంకితభావంతో పనిచేసి గ్రామాల అభివృద్ధికి దోహద పడాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ వెంకటయ్య, ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉప్పునుంతల: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. బుధవారం మండలంలోని జప్తీ సదగోడులో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 20 లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణం పనులకు, నేషనల్ హెల్త్ మిషన్ నిధులు రూ. 20 లక్షలతో నిర్మించనున్న పల్లె దవాఖాన భవవ నిర్మాణాలకు ఎమ్మెల్యే భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సత్తు భూపాల్‌రావు, ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు, సర్పంచ్ మల్లారెడ్డి, ఎంపీటీసీ కవిత తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు రాఖీ కట్టిన మహిళలు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం రక్షాబంధన్ సందర్భంగా మహిళలు ఎమ్మెల్యే గువ్వల బాలరాజుకు రాఖీ కట్టారు. కానుకలు అందించారు.

పశుసంపదను కాపాడుకుందాం



టీకాలను పంపిణీ చేస్తున్న జీవీ రమేష్

వెల్దండ: పశుసంపదను కాపాడుకుందామని జిల్లా పశువైద్యాధికారి జీవీ రమేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పశువులకు గాలికుంటు, ముద్ద చర్మ వ్యాధి నివారణ టీకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు సోకుతున్న వ్యాధులను పరిశీలించి వెంటనే నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం రైతులకు సలహాలు, సూచనలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భూపతిరెడ్డి, ఎంపీటీసీలు ఉమవిజేందర్‌రెడ్డి, జ్యోతినిరంజన్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి



కల్వకుర్తిలో ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

కల్వకుర్తి టౌన్: ప్రతిపక్ష నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీస బాలరాజు అన్నారు. బుధవారం పట్టణంలో ప్రభుత్వ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని కోరారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ రాజుకు ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేశారు. సమావేశంలో యువజన కాంగ్రెస్ నాయకులు మాలిక్, సైదులు, భరత్, వసురామ్, శ్రీహరి, కుమార్, మహేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఎస్ఐ రాజుకు కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. నియోజకవర్గ సభ్యుడు ఉదయ్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు తగిలి కృష్ణయ్య కోరారు.

వెల్దండ: ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి పై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని పార్టీ మండల అధ్యక్షుడు మోతీలాల్‌నాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్, నాయకులు పర్వత్‌రెడ్డి, పుల్లయ్య, శేఖర్, శ్రీనివాస్‌యాదవ్ కోరారు.

ఎంజీకేఎల్ఐ కాల్వపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

ఉప్పునుంతల: మండల కేంద్రం శివారులోని ఎంజీకేఎల్ఐ కాల్వపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని రైతులు కోరుతున్నారు. గ్రామానికి చెందిన దాదాపు 20 మంది రైతులు నల్లచెరువు కట్ట నుంచి పడమర వైపు ఉన్న బండ్ల డొంక దారి గుండా పొలాల్లోకి వెళ్లేవారు. ఆ ప్రాంతంలో ఎంజీకేఎల్ఐ కాల్వను అడ్డంగా తవ్వడంతో పొలాల్లోకి వెళ్లేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కిలోమీటరు దూరం వెళ్లి కటికొల్ల గడ్డ వద్ద నున్న బ్రిడ్జి వద్ద దాటాల్సివస్తుందని రైతులు వెంకట్‌రెడ్డి, బొందయ్య, నర్సింహ్మా, సత్యనారాయణ, తిర్పతయ్య తదితరులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అధికారులు, కాంట్రాక్టర్‌కు సమస్యను వివరించినా ఉపయోగంలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

కనీస వేతనం ఇవ్వాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని యూనియన్ జిల్లా కార్యదర్శి పార్వతమ్మ అన్నారు. బుధవారం కలెక్టర్ ఉదయ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని లేనిపక్షంలో సెప్టెంబర్ 11వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు పూనుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఈశ్వర్, దశరథం, చంద్రకళ, రజిత, వరలక్ష్మి, లక్ష్మి, పుష్ప, యాదమ్మ, వెంకటమ్మ, హైమావతి, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో రక్షాబంధన్ వేడుకలు



తెలకపల్లి సిద్ధార్థ మోడల్ పాఠశాలలో

తెలకపల్లి: మండల కేంద్రంలోని సిద్ధార్థ మోడల్ పాఠశాలలో రాఖీ పౌర్ణమి సందర్భంగా బుధవారం రక్షా బంధన్ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు ఒకరికొకరు రాఖీ కట్టుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అదే విధంగా కేకేరెడ్డి పాఠశాలలో రాఖీలు కట్టుకుని నీవు నాకు రక్ష నేను నీకు రక్షా మనమంతా దేశానికి రక్షా అని నినాదాలు చేశారు. రక్షాబంధన్ విశిష్టతను ఉపాధ్యాయులు వివరించారు. ప్రిన్సిపాల్ శివప్రసాద్, సువర్ణ, రమేష్‌గౌడ్, రామస్వామి, రేణుక, బాలు, ప్రభాకర్, విష్ణువర్ధన్‌గౌడ్, ఎండీ పాషా, కార్తీక్, స్మిత, మల్లికార్జున్, పద్మ, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలోని పాఠశాలల్లో ముందస్తు రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, సాయిప్రభ, ఆనంద్ రక్షాబంధన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

వెల్దండ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏబీవీపీ మండల శాఖ ఆధ్వర్యంలో రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏబీవీపీ కార్యకర్తలకు రాఖీలు కడుతూ నేను నీకు రక్ష నీవు నాకు రక్ష మన ఇద్దరం దేశానికి రక్షా అంటూ ప్రతిజ్ఞ చేశారు. శాస్త్ర ఇంటర్‌నేషనల్ పాఠశాలల్లో బాలికలు బాలురకు రాఖీలు కట్టారు. ఏబీవీపీ కార్యదర్శి ఉమేష్, నాయకులు చరణ్, వంశీ, మధు, తదితరులు ఉన్నారు.

ఉద్యోగాల కల్పనలో ప్రభుత్వం విఫలం

కందనూలు: ఉద్యోగాల కల్పనలో ప్రభుత్వం విఫలం అయ్యిందని కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం సకలజనులు ఏకమై రాష్ట్రం సాధించుకున్నామన్నారు. ఓట్ల కోసం తూతూ మంత్రంగా ఉద్యోగాల నోటిఫికేషన్ ఇచ్చి సీఎం కేసీఆర్ నిరుద్యోగులను మోసం చేస్తున్నారన్నారు. ఒక విద్యాశాఖలోనే దాదాపు 35 వేలకు పైగా టీచర్ పోస్టులు ఖాళీలు ఉన్నాయని వివరించారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో ఉద్యోగాల కోసం పోరాడాల్సిన దుస్థితి రావడం సిగ్గుచేటు అన్నారు. కేజీ టు పీజీ ఉచిత విద్య ఏమైందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయతి విజయ్ కుమార్ రెడ్డి, ముస్లిం మైనార్టీ జిల్లా అధ్యక్షుడు హబీబ్, జిల్లా తైలి శ్రీనివాసరావు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొడిదల రాము, ఎన్ఎస్ యూఐ అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.